# ద్విభాష్యం రాజేశ్వర రావు

# 'ఆకాశపల్లకి'

బస్సు కోసం నిరీక్షిస్తూ నిలబడ్డాను!

రాబోయే వర్షానికి సూచనగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి.

మధ్యాహ్నం కురిసిన జల్లులకు తార్కాణంగా రోడ్డు మీద తడి ఆరని చిహ్నాలు ఇంకా స్పష్టంగా కనబడుతున్నాయి!

బస్సు రావడం ఆలస్యమయినందుకు వాచీ వంక చూసుకుంటూ నిలబడ్డాను..

నేను వెళ్ళాల్సిన దూరం సుమారు ఎనిమిది కిలోమీటర్లకు పైగానే వుంటుంది!

బోలెడు డబ్బులు పోసి, ఆఫీసయ్యాక ఆటోలో ఇంటికి వెళ్ళగల్గిన ఆర్థిక స్తోమత నాకు లేదు!

విసుక్కున్నా, తిట్టుకున్నా ఆఖరుకు సిటీ బస్సే నాకు శరణ్యం!!

అంతలోనే-ఒకామె, మెల్లగా నడచుకుంటూ నాకు సుమారు నాలుగ్గజాల దూరంలో నిలబడింది! చేతిలో చిన్న గొడుగు! లేతాకు పచ్చని పువ్వుల పట్టుచీరలో వుందామె!!! కంటికి వున్న జోడును బయటకు తీసి చీర చెంగుతో తుడిచి మళ్ళీ పెట్టుకుంటోంది!

కళ్ళజోడు తీయగానే ఆమె వంక పరికించి చూస్తున్న నా గుండె ఝల్లుమంది!

రెండు నిమిషాలసేపు పరిసరాలను మరిచి ఆమె వంక తేరిపార చూస్తూ వుండిపోయాను!

ఆమె- రమ్య!!

పన్నెండేళ్ళ క్రితం నాకు దూరమయిపోయిన రమ్య!

కాదు!- దూరం చేసుకున్న రమ్య!!

'గోపీ! అసలు, ప్రేమంటే ఏమిటి? పిచ్చి కాదూ? ఒకరి కోసం ఒకరు పలవరించటం, ఒకరి కోసం ఒకరు ఎదురుతెన్నులు చూడటం, ఒకరు లేకపోతే మరొకరు ఏమయిపోతారోనని మధనపడి పోవటం, ప్రేమించిన వ్యక్తే సర్వస్వం అనుకోటం; ఇవన్నీ ఏమిటి? నిజంగా ఉన్మాదమే! కాకపోతే నువ్వెవరివి? నేనెవర్ని?! ఆరు నెలల క్రితం మనిద్దరికీ కనీస పరిచయమయినా లేదే! అలాంటిది- ఈవేళ- ఒకరిని విడిచి మరొకరం వుండటం-ఒక్క క్షణమయినా సాధ్యం కాదు- అనుకునే స్థితికి వచ్చేం! ఇది పిచ్చి కాదంటావా గోపీ?!' అంటూ నా గుండెల్లో తల దాచుకుని, మునివేళ్ళలో నా వక్షం మీద సుతారంగా రాస్తూ, తన పెదాలతో నా హృదయంలోకి నేరుగా సందేశాలు పంపుతూ, తన నల్లని కురులతో నా ముఖాన్ని కప్పేస్తూ, నాలో ఒదిగిపోయిన రమ్య!

"రమ్యా! మన పెళ్ళినాడు పల్లకిలో ఊరేగుదామా?" అంటూ మెల్లగా అడిగితే, 'ఓ! చక్కగా పల్లకీలో ఊరేగుదాం! పల్ల[కి] ఎక్కే అనుభూతి ప్రతి వాళ్ళకి జీవితంలో ఒక్కసారే కదూ వస్తుంది! అది మన[ం] ఎందుకు పోగొట్టుకోవాలి?' అంటూ గారాల[ు] పోయిన రమ్య!!!

మరొకసారి పరీక్షగా ఆమెవంక చూసేను [...] సందేహం లేదు!

కుడి బుగ్గ కింది భాగంలో కందిగింజంత నల్లటి పుట్టుమచ్చ! విల్లులా వంగిపోయిన కొనలు తేలిన కనురెప్పలు! సంపెంగ పువ్వు లాంటి ముక్కు! ఆ అందమయిన ముక్కు[ని] నేను గుర్తుపట్టగలను, ఎన్ని సంవత్సరాల తర్వాతయినా సరే!!

ఈ పన్నెండేళ్ళల్లో ఆమె శరీరంలో కనబడే మార్పుల కోసం వెదికేను! కాస్త ఒళ్ళు చేసి మునుపటి కంటె పుష్టిగా కనబడుతోంది! కనురెప్పల క్రింద కాల చక్రం గీసిన నల్లని గీతలు!! మచ్చుకయినా తలలో ఒక్క తెల్ల వెంట్రుక కన్పించటం లేదు! మెడలో బంగారు గొలుసు!! గొలుసు చివర జాకెట్‌లో ఒదిగిపోయింది!



కనుపాపల వెనుక అదే మెరుపు!

పెదాల్లో అదే నిశ్చలత! పట్టుదల!!

కథా నిలయం
శ్రీకాకుళం

అలనాడు ప్రేయసి రమ్య!

మనసు తెలుగు 'ఎమ్మే' చదువుతున్ననాటి రోజుల్లోకి తొంగి చూసింది!

* * *

"మీ చేతిలో ఆ పుస్తకం ఏమిటి?"

కోమల మయిన కంఠస్వరం విని తలెత్తి చూశాను!

ఎదురుగా నాక్లాస్‌మేట్ రమ్య! ఆమెను ఇంతకుముందు క్లాసులో చూడటమేగాని ఇంత వరకూ పలకరించలేదు.


ఆమెసౌందర్యానికి ముగ్ధులై ఆమెపరిచయమే మహాభాగ్యమనుకుని ఉవ్విళ్ళూరిపోయే నా సహాధ్యాయులు చాలామంది వున్నారు.

అయితే, నాకు తెలిసినంత వరకూ ఆమె ఎన్నడూ ఎవ్వరికీ పరిచయం కల్పించుకునే అవకాశం ఇవ్వలేదు ఈ నెలరోజుల్లోనూ!

గుండ్రని అందమయిన ముఖం, నుదుట చిన్న బొట్టు, చెవులకు ఒంటిముత్యం దుద్దులు, మెడలోంచి జారిపోయివక్షస్థలంలో దాచుకున్న ఒంటిపేట గొలుసు; రమ్యనుచూసిన మొదటి క్షణంలోనే ఆమె రమ్యమయిన అమ్మాయి అని ఎవరికయినా తోస్తుంది!

ఆ విశాలమయిన లైబ్రరీ హాలులో పుస్తకాల బీరువాల నడుమ మేమిద్దరం!

ఆమె నిశ్చయంగా నన్నే అడుగుతోంది!



నా నోటమాట పెగిలిరాలేదు! ఆమె వంక చూస్తూ వుండిపోయాను!

"గోపీ కృష్ణగారూ! మీచేతిలోని పుస్తకం ఏమిటి?" మళ్ళీ అడిగింది. స్పష్టంగానా పేరుతో పిలుస్తూ.

"ఆ ఇదా...ఇది!... భోగినీ దండకం!" అన్నాను తడబడుతూ.

"ఒక్కసారి ఇటివ్వండి!" అంటూ చొరవగా నా చేతిలోంచి పుస్తకం అందుకుంది.

పుస్తకం తీసుకుంటూ వుండగా ఆమెకుడిచేతి వేళ్ళు నా చేతి వేళ్ళకు తగిలేయి వెచ్చగా!!

ప్రాణం జివ్వు మంది! ఎంత తీయని స్పర్శ?!

పుస్తకం తిరగేస్తూ "భోగినీ దండకం పోతనామాత్యుడే రాసేడని నమ్ముతున్నారా?" అంది సూటిగా.

"ఆహా! పోతనే రాసేడు! అందులో నాకేమీ సందేహంలేదు!" అన్నాను.

"మందార మకరందంలాటి భక్తిభావాన్ని మహా భాగవతంలో నిక్షిప్తం చేసి తెలుగు వాళ్ళకి అందించిన ఒకమహా భక్తుడు, కేవలం ఒక వేశ్యమీద దండకం రాశాడంటే ఎలా నమ్మటం?" అంది.

"కామిగాని మోక్షకామిగాడు కదా! పోతన గారు భక్తిపారవశ్యంలో మునిగిపోయే ముందు రోజుల్లో మహా రసికుడయి ఉండాలి! భోగినీ దండకం ఆ సమయంలో రాసి వుండొచ్చు! దాని నడకను బట్టి తప్పకుండా పోతనగారే దాన్ని వ్రాసి వుంటారని మనం నమ్మొచ్చు!"

నా సమాధానం ఆమెకు రుచించినట్టులేదు!

"ఇమ్మను జేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనమ్ములున్, సొమ్ములు కొన్ని పుచ్చుకుని, కాలుని సేత సమ్మెట పోటులుంబడక... అంటూ విలవిల్లాడిపోయిన భక్త శిఖామణి ఓ వేశ్యమీద దండకం అల్లేడంటే నేను నమ్మను! ఇక పోతే నడక సంగతంటారా? ఎర్రాప్రెగడను అనుకరిస్తూ బోలెడు పద్యాలు రాసేరు పోతన్నగారు! అలాగే పోతన్న శైలిని అనుకరిస్తూ వేరెవరయినా భోగినీ దండకం రాసి పోతన్నగారి పేరుమీద చలామణీ చేశారేమో? వేమనగారి తర్వాత బోలెడు చాటువులు రాసి ఆయన శతకం కిందే వాటిని చాటిచెప్పటం మనం వినటంలేదా? ఇదీ అలాగే! ఆఖరికి మార్క్సిస్టు సిద్ధాంతాలను కూడా వేమన ధోరణిలో రాసి ఆనాడే వేమన మహాశయుడు ఈ ముక్కలు చెప్పేడు అంటూ దండోరా వేసే పండిత ప్రకాండులు ఈనాడు మనకు లేరా? అందువల్ల కేవలం నడక, శైలి పీటిని బట్టి గ్రంథ కర్తృత్వం నిర్ధారించటం న్యాయం

కాదేమో? ఏమంటారు?" అంటూ మాట్లాడటం ముగించింది రమ్య!

"ఎర్రనగార్ని అనుకరిస్తూ పోతనగారు పద్యాలు రాసేరా? ఇది చాలా అన్యాయం! ఈ విషయం నేను ఒప్పుకోను!" అన్నాను రమ్య మాటలు ఖండిస్తూ.

"ఏం మహాశయా? పోతన్నగారు మీకు పిల్లనిచ్చిన మామగారా ఏమిటి? అంత గట్టిగా సమర్థిస్తున్నారు! సరేలెండి, మీకు ఉదాహరణలు తొందరలోనే నేను తీసుకువచ్చి చూపిస్తాను! ఎర్రనగారి పద్యాలను ఎన్నోచోట్ల పోతనగారు అనుకరించేరు! ఆ విషయం మీ చేతే ఒప్పిస్తాను నేను! బై! మళ్ళీ కలుద్దాం!" అంటూ భోగినీ దండకం పుస్తకం నాకు అందించి మెల్లగా నడుచుకుంటూ వెళ్ళిపోయిందామె !!

తర్వాత ఓ వారం దినాలకు మళ్ళీ లైబ్రరీలోనే రమ్యను కలిసేను!

శ్రీశ్రీ గురించి మెటీరియల్ సేకరిస్తూ వుండగా నా ఎదుటి కుర్చీలోకి వచ్చి కూర్చుంది రమ్య!

"హలో! బాగున్నారా?" అన్నాను పలకరింపుగా నవ్వుతూ.

ఆమె పుస్తకాల్లోంచి ఒక కాగితం బయటకు లాగుతూ "చూడండి! బోలెడు మెటీరియల్ సేకరించి తెచ్చేను!" అంది.

"దేని గురించి?" అన్నాను అంతా మరిచి పోయినట్లు ముఖం పెట్టి!

"ఎర్రనగారు రాసిన పద్యాలను పోతన్నగారు అనుకరించారంటే మీరు ఒప్పుకోలేదు కదా! ఇవిగో చూడండి! ఇవన్నీ ఉదాహరణలే! ఎర్రనగారు తాను వ్రాసిన నృసింహపురాణంలో 'కలడు మేదినియందు, గలడుదకంబుల గలడు వాయువునందు గలడువహ్నియందు...' అంటే పోతనగారు తన భాగవతంలో 'ఇందు గలడందులేడని సందేహము వలదు, చక్రి సర్వోపగతుండు...' అన్నారు. అలాగే ఎర్రనగారి 'వాసుదేవుని పాద వనరుహంబుల భక్తి తగదను తండ్రియు తండ్రిగాడు...' అనే పద్యానికి పోతన్నగారి 'కమలాక్షు నర్చించు కరములు కరంబులు...' అనే పద్యానికి ఎంతో దగ్గర సంబంధం కన్పిస్తుంది మనకు. భావంలోనూ, నడకలోనూ కూడా! ప్రహ్లాదునికి ఎల్లవేళలా హరినామస్మరణమే తప్ప వేరే తలంపు లేదని చెప్పే సందర్భంలో 'కుడిచినపుడు, నిద్రకూరినయపుడు, మేలుకొనిన యపుడు, మెలగినపుడు...' అని ఎర్రనగారు అంటే; 'పానీయంబుల ద్రావుచుంగుడుచుచు భాషించుచునే, హాసలీలా నిద్రాదుల చేయుచున్...' అంటారు పోతన్నగారు! ఇలా వెతుక్కుంటూపోతే బోలెడు సామ్యాలు కనపిస్తాయి మనకు!"

మాటలు ముగించి ఆ కాగితం నాముందర పడేసింది !

ముత్యాల్లాంటి అక్షరాలు !!

'కస్తూరీ తిలకం !' అనబుద్ధేసింది !

"అక్షరాలు ఎంత అందంగా వుంటే, మనసంత అందంగా వుంటుందిట !" అన్నాను నవ్వుతూ.

"ఎవరు చెప్పేరో ఈమాటలు ?" అంది.

"ఎర్రన, పోతన మాత్రం కాదులెండి !" అన్నాను నవ్వుతూ.

నా మాటలకు తాను కూడా హాయిగా నవ్వేసింది.

వాదనను ప్రక్కదారి పట్టించేను కాని, మనసులో ఆమె ప్రతిభకు జోహార్లను లేకుండా వుండలేకపోయాను !

రమ్య చాలా చదివింది ! ఆ విషయం నాకు తొందరగానే అర్థమయిపోయింది.

"మరో సంగతి చెప్పమంటారా ?" అంది రమ్య నావేపు అదోలా చూస్తూ.

"చెప్పండి !" అన్నాను.

"పాత్రపోషణలో ఔచిత్యం ప్రదర్శించటంలో ఎర్రాప్రెగడకు ఓ మాత్రం సరిపోలడు పోతన్నగారు !" అంది నిశ్చయంగా.

"అలా మీరు మాట్లాడటం అన్యాయం ! ఎవరి తీరు వారిది ! ఇద్దరిదీ సుమధుర కవిత్వమే ! కాదని ఎలా అనగలం ?"

"కవిత్వం సుమధురం కాదని నేనుమాత్రం అన్నానా ? పోతన్నగారి తరపున మీరు వకాల్తా ఎందుకు పుచ్చుకుంటున్నారు ? పాత్ర పోషణలో మాత్రం ఎర్రాప్రెగడకు పోతన తీసి కట్టే అంటాను !"

"ఎలా చెప్పగలరు ?" కుతూహలంగా ఆమె వంక చూస్తూ అడిగేను.

"చెబుతాను, వినండి" అంటూ ప్రారంభించింది ఆమె. "పోతన్నగారికి ప్రతి విషయం భక్తిపరంగా అన్వయించటం తప్ప వేరే పద్ధతి తెలీదు. ప్రహ్లాదుణ్ణి, ఆరేళ్ళ కుర్రవాడిని గురించిన గుణగణాలు వివరించి చెబుతూ 'పరాయి స్త్రీలు కన్పిస్తే తల్లిలా భావించి దారినుండి వైదొలగుతాడు' అంటాడు. ఆరేళ్ళ కుర్రాడికి పరాయి స్త్రీల యెడల ప్రత్యేకమయిన భావం అంటూ ఏమీ ఉండదు కదా ! అది పాత్ర ద్వారా చూస్తే అనౌచిత్యం కాదా ? అయినాసరే ! భక్తి వెల్లువలో అది కొట్టుకుపోయింది ! గోపికలు చిన్ని కృష్ణుని మీద ఫిర్యాదు చేస్తే ఆ యశోదమ్మతల్లి ఏం చేసింది ? బాలగోపాలుని నోట్లో విశ్వాన్ని చూసి కొడుక్కి నమస్కరించింది' అంతేకాదు! కాళింది మడుగులో పడిన కృష్ణుని తలచుకుని 'తండ్రీ నీవు సర్పదష్టుడవైయున్న, ఇచట మాకు ప్రభువెవ్వరు ?' అంటూ రోదిస్తుంది. అమె దృష్టిలో కృష్ణుడు తన కొడుకుగాడు !


## రహస్యం

ఓ ప్రసిద్ధ నవలా రచయిత్రిని విలేఖరి ప్రశ్నిస్తున్నాడు.

"సంసారం జీవితం గురించి మీరు గొప్పగా వ్రాస్తారు. ఎలా సాధ్యం ?"

"నేనింకా సంసారిని కాలేదు గనుక" తక్షణమే జవాబిచ్చింది రచయిత్రి.

జి. నాగేశ్వరరావు
ఒంగోలు



### సైలెన్స్

సెట్ లో డైరెక్టర్: సైలెన్స్...యాక్షన్

కొత్తహీరో నోరు మెదప లేదు.

డైరెక్టర్ మండిపడి "డైలాగ్ చెప్పవేమిటయ్యా?" కసిరాడు.

"మీ రేగదండీ ముందు 'సైలెన్స్' అని పెద్దగా అరిచారు" అన్నాడు కొత్తహీరో ఆవేశంగా!

—డి.వి.యస్. శ్రీకాంత్

ప్రభువే! దైవమే! పోతన్నగారు తనకు కృష్ణుని యెడల భక్తి తత్పరతను ప్రకటిస్తూ రాయటంలో యశోద చేతకూడా భక్తిపరంగానే పలికించేరు. అంతేకాని, పాత్ర పరమయిన న్యాయం గురించి ఆలోచించలేదు ఆయన! అది ఒక భక్తి వెల్లువ! ఒక ఝరి! అంతే! దానికి అంచుల్లేవు! అవధులంతకంటే లేవు!! అదే ఎర్రనగారి హరివంశం తీసుకోండి! అందులోని యశోద వెర్రిబోగుల తల్లి! నూటికి నూరుపాళ్లు తెలుగింట బుట్టిన తల్లి! పాత్రల పరంగా కథను నడిపించేటపుడు వాళ్ళ వాళ్ళ నైజాలతో నడిపించటం న్యాయం గానీ, తన ముద్రనే అందరిమీద వేయటంఎంత వరకూ న్యాయం? అందుకే తనదైన భక్తి ముద్రను తప్పించుకోలేని పోతన్నగారు భోగినీ దండకం రాసి వుండరని నా అభిప్రాయం!!"

ఆమె మాటలు ముగించేక కొద్ది నిముషాల సేపు నాకు ఊపిరి సలపలేదు! ఆమె మేధస్సుకూ, జ్ఞానానికి మనసులోనే మరో మారు జోహారులర్పించేను!

"ఒప్పుకున్నాను! నెత్తిమీద టోపీ లేదు గాని లేకపోతే దాన్నితీసి పట్టుకుని 'హేట్సాఫ్' అనే వాడిని మీ మేధాశక్తికి!" అన్నాను చిర్నవ్వుతో.

నా పొగడ్తకు సిగ్గుపడి పోయింది రమ్య!

"మరీ అందలం ఎక్కించెయ్యకండి!... సరే! ఎమ్మే పూర్తయ్యాక రీసెర్చి చేస్తారా" అడిగింది.

"చేయాలనే అనుకుంటున్నాను. ఆర్థిక పరిస్థితులు అనుకూలించాలి కదా! ఉద్యోగం వెంటనే దొరికిపోతే రీసెర్చి ప్రసక్తిలేదు! లేకపోతే ఆలోచించాలి!" అన్నాను.

"నేను మాత్రం ఎమ్మే పూర్తయ్యాక రీసెర్చి చేద్దామనుకుంటున్నాను! ఎర్రన గారి హరి వంశం మీద! అది నాకు ఎంతో ఇష్ట మయిన గ్రంథం!" అంది.

"మీ ఆలోచన దివ్యంగా వుంది! మీరు తప్పకుండా 'డాక్టరేట్' చేయండి! చాలా సులువుగా అయిపోతుంది మీకు!" అన్నాడు ప్రోత్సహిస్తూ.

"హరి వంశం గ్రంథాన్ని మొదటిసారిగా పుస్తక రూపంలో ఎప్పుడు ముద్రించారో మీకు తెలుసా?" అంది.

"తెలీదు!" అన్నాను, ఆ విషయం నాకు తెలియనందుకు నొచ్చుకుంటూ.

"1901లో వేయి ప్రతులు ముద్రించేరు! మళ్ళీ తర్వాత 1960లో రెండో ముద్రణ జరిగింది. అంటే వేయి ప్రతులు చెల్లుబడి కావటానికి సుమారు అరవై సంవత్సరాల కాలం పట్టిందన్నమాట! ఇది ప్రతి తెలుగు వాడూ సిగ్గుపడవల్సిన విషయం కాదూ! మన ఆరాధ్య రచయిత్రుల నవలలు వేలకు వేలు ముద్రిస్తే వారం తిరిగేసరికి రెండో ముద్రణకు నోచుకుంటున్నాయి. ఆపాటి ఆదరణకు నోచుకోలేదు 'హరి వంశం!' కవిత్రయం గురించి జబ్బలు చరుచుకునే మనం హరి వంశానికి ఇస్తున్న ఆదరణ అది!! నేను ఆ గ్రంథం మీద రీసెర్చి చేసి నలుగురికీ దాని లోని విశేషాలు అర్థమయ్యేలా వివరించి చెప్పాలనుకుంటున్నాను" ఆవేశంగా అంది రమ్య!!

విస్తుపోయి ఆమె వంక చూస్తూ మిగిలి పోవటం నావంతయింది!

"సారీ! కాస్త ఆవేశం పాలు నాలో హెచ్చు! మరోలా అనుకోకండి!... సరే! మీరు మాఇంటికి ఒకసారి రావాలి! మాఅక్కయ్యనూ, అమ్మనూ మీకు పరిచయం చేస్తాను! కృష్ణానగర్‌లో బోరింగు పంపు దగ్గరే మా ఇల్లు! ఇంటి ముందు ఆవరణలో పెద్ద పారిజాతం మొక్క వుంటుంది! అదే గుర్తు మీకు!! తెల్లవారేసరికి మా ఎదుటి ఆవరణ నిండా ఎన్ని పారిజాతం పూలో!!" అంది కళ్ళు చక్రాల్లా తిప్పుతూ.

"తప్పకుండా వస్తాను! మీ ఆహ్వానానికి కృతజ్ఞుణ్ణి!" అన్నాను మనసులోనే ఆనంద పడుతూ.

ఆ తర్వాత, నాలుగు రోజుల్లోనే రమ్య ఇంటికి వెళ్ళేను. వాళ్ళమ్మగారు నన్ను ఎంతో ఆదరంతో పలుకరించేరు. ఆవిడ బలవంతం మీద ఆరాత్రి వాళ్ళ ఇంట్లోనే భోజనం కూడా చేయాల్సి వచ్చింది! హాస్టలు మెతుకులతో చచ్చిపోయిన జిహ్వ ఆవేళ మళ్ళీ లేచివచ్చి నట్లయింది.

"బాబూ! నీగురించి మా రమ్య ఎప్పుడూ చెప్తూవుంటుంది! ఇది నీఇల్లే అనుకో! అప్పు డప్పుడు వచ్చి వెళ్తూవుండు!" అంది ఆవిడ నన్ను సాగనంపుతూ.

'రమ్య నా గురించి చెప్తూవుంటుందా? ఏం చెప్తూవుంటుంది? అసలు రమ్యకు నాగురించి ఏం తెలుసు?'

రమ్యకు నా యెడల ఇంత సదభిప్రాయం కలిగినందుకు నా అదృష్టాన్ని మనసులోనే అభినందించు కున్నాను.

తర్వాత, మా ఇద్దరి పరిచయం రెండు నెలల్లోనే గాఢమయిన స్నేహంగా మారింది! మాట్లాడుకునేందుకు 'కామన్ సబ్జక్టు', అభి రుచులలో దగ్గరతనం, భావాల్లో ఏకత్వం; ఇవి నన్నూ, రమ్యనూ మరింత దగ్గరకు చేర్చి ప్రేమ వైపు నడిపించేయి!

ఆరు నెలలు తిరిగే సరికి ఒకరిని విడిచి మరొకరు కనీసం ఒక దినమయినా గడపలేని స్థితికి చేరుకున్నాం!

ఆమె సామీప్యంలో ఏదో ఆకర్షణ!!

ఆమె మాటల్లో నిర్వచించలేని ఆనందం!!

ఆమె కళ్ళలోకిచూస్తూకూర్చుంటే గంటలు నిమిషాల్లా గడిచి పోతాయి!!!

ఆమెను కవ్వించి, కోపం తెప్పించి, ముఖం కందగడ్డలా మార్చి, వణికి పోయే ఆమె పెదాలవంక చూడటం నాకెంతో యిష్టం!!

మా ఇద్దరి జీవితాలు ఎంతో గాఢంగా పెన వేసుకున్నాయి!

అయితే-ఆ తర్వాత నా జీవితంలో జరిగిన ఓ దుర్ఘటన మా జీవితగతుల్నే మార్చివేసింది!

నాకు ఉన్నట్టుండి జ్వరం రావటం ఆరం భించింది! మొదట్లో నిర్లక్ష్యం చేసాను! తర్వాత మందులు వాడినా తగ్గలేదు!

ఒకరోజు నార్మల్‌కి వచ్చి మళ్ళీ రెండో రోజు ప్రత్యక్ష మయ్యేది!

ఒంట్లో నిర్వచించలేని బాధ; తెలియని నీరసం! కృంగి పోతున్న అనుభూతి! పది హేనుదినాలు గడచే సరికి మంచం మీదనుంచి మరొకరి ఆసరాతో లేవాల్సిన పరిస్థితి వచ్చింది. కడుపుమీద కుడి భాగంలో వున్న పెద్ద పుట్టుమచ్చ చుట్టూ ఎర్రగా వాచిపోయి బిళ్ళలా కట్టిన సంగతి చాలా ఆలస్యంగా గమనించాను!

డాక్టర్లు పరిక్షించి 'మెలనోమా' అన్నారు.

'బయాప్సీ' తీసి మరీ నిర్ణయించేరు!!

మెలనోమా!!

అతి భయంకరమయిన కేన్సర్!!

నా అతిభయంకరమయిన రోగం గురించి రమ్యకు తెలియకూడదు! ఆమె తల్లడిల్లి పోవటం నేను చూడలేను! అందుకే అసలు ఈ విషయం ఆమెతో చెప్పలేదు!!

ఉత్తరం రాస్తే నాన్నవచ్చి మా స్వగ్రామం తీసుకుపోయేడు! తర్వాత ఓ వారం రోజుల్లో నన్ను రాయవెల్లూర్ తరలించేరు!!

రాయవెల్లూరులో ఆపరేషన్ నిమిత్తం ఆరు నెలలు వుండిపోవాల్సివచ్చింది! నేను మృత్యుముఖంనుండి బయటపడినందుకు డాక్టర్లే ఆశ్చర్యం ప్రకటించేరు! అంతా దైవకృప తప్ప వేరు కాదన్నారు !!!

ఈ ఆరు నెలల్లోనూ రమ్యకు నేను ఏ విధమయిన ఉత్తరమూ రాయలేకపోయాను !

అసలు నా బ్రతుకు గురించి నాకే నమ్మకం లేదు! ఈ విషాదం ఆమెకు తెలియజేయటం సుతరామూ ఇష్టంలేకపోయింది నాకు!!

మా స్వగ్రామంలో, ఇంటిదగ్గర, మరో ఎనిమిది నెలలు మంచంమీదే విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది.

పరిపూర్ణమయిన ఆరోగ్యం చేజిక్కించుకుని మళ్ళీ పధ్నాలుగు నెలల తర్వాత ఆత్రంగా విశాఖపట్నం వచ్చేను రమ్యకోసం!

ఆ ఇంట్లో రమ్య లేదు!

ఏడాది క్రితం రమ్య అక్కగారికి బీహారులో ఉద్యోగం వస్తే మొత్తం కుటుంబం అంతా అక్కడకు వెళ్ళిపోయేరట! అంతకంటే నాకు ఏ విధమయిన వివరమూ దొరకనేలేదు.

తర్వాత నేను ఎమ్మే తెలుగు పూర్తిచేసి హైదరాబాద్ సచివాలయంలో ఉద్యోగంలో చేరాను. అక్కడే పది సంవత్సరాలు గడిచిపోయాయి! తర్వాత తెలుగు భాషను అమలు పరిచే ఆఫీసరుగా విశాఖపట్నం కలెక్టరు ఆఫీసులో పోస్టుకు నన్ను ప్రమోషనుమీద బదిలీచేశారు! సుమారు ఆరు నెలల క్రితం విశాఖపట్నం వచ్చేను!

ఆఫీసుకు వెళ్ళటం, రావటం, సిటీబస్సుల కోసం నిరీక్షణ, దీనితో యాంత్రికంగా గడిచిపోతోంది విశాఖ జీవితం!!

* * *

ఇన్నాళ్ళ తర్వాత - కాదు, ఇన్నేళ్ళ తర్వాత - మళ్ళీ రమ్యను ఇలా చూడటం!

నా నిరీక్షణ ఫలించింది!

మనసు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయింది !!

నా ఆశ్చర్యాన్ని, గగుర్పాటునూ కప్పిపుచ్చుకుంటూ ఆమె దగ్గరకు వెళ్ళి మెల్లగా "మీరు...మీరు !..." అంటూ ఆగిపోయాను.

ఆమె నా వంక రెండు నిమిషాలపాటు వెర్రిదానిలా చూసింది! తర్వాత ఆమె ముఖంలో అనిర్వచనీయమయిన ఆనందం తొంగి చూసింది !

"నువ్వు !..." అంటూ పెదాలు కదిపిస్తూ వుంటే మాట్లాడలేకపోయింది.

"నేను... గోపీని, రమ్యా !" అన్నాను.

"గోపీ ! నువ్వేనా ? నిజంగా నువ్వేనా ? ఎంతలా మారిపోయావ్ ?"

నా ఆనందానికి అవధుల్లేవు !!!

"రమ్యా ! అలా హోటల్లో కూర్చుని మాట్లాడుకుందాం ! రా ! ఒక కప్పు కాఫీ త్రాగుదాం, నీకభ్యంతరంలేకపోతే !" అన్నాను చొరవగా.

"పద !" అంటూ నా వెనుక వచ్చింది.

హోటల్లోకి వెళ్ళి 'ఫామిలీ కేబిన్'లోకి చేరి టేబుల్‌కు చెరోవైపుగా కూర్చున్నాం! కేబిన్‌లో వేరెవ్వరూ లేరు !

"రమ్యా ! టిఫిన్ తింటావా !" అడుగుతూ వుంటే నా గొంతు నాకే వింతగా ధ్వనించింది !

"అబ్బే ! వద్దు ! కాఫీ చాలు !"

సర్వర్‌తో రెండు స్ట్రాంగ్ కాఫీ తీసుకురమ్మని చెప్పేను !

రమ్య కాలి వేళ్ళ వంక చూశాను ! వేళ్ళకు మట్టెలు లేవు !!

ఈ కాలంలో ఎంత మంది మట్టెలు ధరిస్తున్నారు ? !

మెడలో ఆత్రంగా వెదికేను ! నల్లపూసలు కనబడలేదు ! కాని - ఆ బంగారు ఒంటిపేట గొలుసు చివరలో అందమయిన రొమ్ముల మధ్య ఒదిగిపోయి ఏమి వుందో తెలుసుకోవటం ఎలా సాధ్యం ?! !

ఏం పలకరించటం ? ఎలా పలకరించటం?!

వెర్రిగా ఒకరి వంక ఒకరు చూసుకుంటూ సుమారు మూడు నిమిషాలు గడిపేం !

సర్వర్ కాఫీలు, వాటితో బాటు బిల్లు తెచ్చి టేబిలు మీద వుంచి వెళ్ళిపోయేడు !

గొంతు సవరించుకుంటూ అడిగేను.

"రమ్యా ! పెళ్ళి చేసుకున్నావా ?"

సూటిగా అడిగిన ఈ ప్రశ్నతో దెబ్బతిన్నట్లు నాముఖం వంక చూసింది రమ్య ! తర్వాత రెండు నిముషాల సేపు మౌనమే !

ఆమె సమాధానం ఏం చెప్తుందోనని కొంతసేపు నా గుండెలు దడదడలాడేయి !

"చేసుకున్నాను !" అంది. తర్వాత క్షణం ఆగి "...ఆయనటాటాలో డిజైన్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు ! ఇద్దరు పిల్లలు మాకు ! ఒక మొగ, ఒక ఆడ ! ... మా అమ్మ పెన్షన్ విషయంలో గొడవొస్తే కలెక్టరాఫీసుకువొచ్చేను పని పూర్తయిపోయింది ! ఈ రాత్రికి టాటానగర్ వెళ్ళిపోతున్నాను ! ..." ఆమె చెప్పుకుపోతోంది !

మాట్లాడుతూ వుంటే ఆమె పెదాలు వణుకుతున్నాయి !!

ఈ సమాధానం కోసమేనా నేను ఇంతకాలం నిరీక్షించింది ?!

ఈ జవాబు వినటానికేనా నేను ఇన్ని సంవత్సరాలు ఎదురుచూసింది ? అని మనసు విలవిల్లాడిపోయింది ! !

రమ్య మెల్లగా అడిగింది. "గోపీ ! నీకు పెళ్ళయిందా ?"

సమాధానం చెప్పటానికి క్షణం సేపు తత్తర పడి "అయింది !" అన్నాను.

"మీ ఆవిడ బాగుంటుందా ?"

"ఓ ! చాలా బాగుంటుంది !" అన్నాను కాఫీ త్రాగడం ముగించి కప్పు టేబిల్ మీద పెడుతూ ! నాకు రమ్య మీద ఏదో కసి పెరుగుతోంది !! తానుకాఫీ త్రాగటంముగించి "పద వెళ్దాం ! నాకు సమయం చాలదు ! మళ్ళీ రాత్రి బైటకు వెళ్ళిపోవాలి !" అంది.

ఇద్దరం హోటల్లోంచి బయటకు వచ్చేం! ఖాళీగా వెళ్ళిపోతున్న ఆటోని ఆపి ఎక్కేసింది ఆమె !! ఆటో ఎక్కుతూ వుంటే ఆమె కనుకొలకుల్లో మెదిలిన నీటి బిందువులు స్పష్టంగా కనుపించేయి నాకు !!

ఆటోలో ఎదరకు వంగి సర్దుకుని కూర్చుంటూ, మెడలోని బంగారు గొలుసును బయటకు లాగి ఎదర గుండెలమీదనిర్లక్ష్యంగా పడేసుకుంది. తన పుస్తెలను నా ఎదుట ఘనంగా ప్రదర్శించటానికి కాబోలు !?

ఆశ్చర్యం ! పుస్తెలులేవు! నేనుపన్నెండేళ్ళ క్రితం బహుమతిగా ఇచ్చిన 'గోల్డ్ కవరింగ్ లాకెట్' తన మెరుగును కోల్పోయి కళావిహీనంగా కదిలింది !

ఛళ్ళున కొరడాతో నావీపు మీద ఎవరో చరిచినట్లయింది !!

"రమ్యా !" అంటూ ఏదో చెప్పబోయాను!

"తొందరగా పోనీయ్ బాబూ !" అంది ఆటో డ్రైవర్‌తో రమ్య !

ఆటో అతి వేగంగా కదిలిపోయి, ఒక్క నిమిషంలోనే కనుమరుగయి పోయింది !

నిస్సహాయంగా రోడ్డు వంక చూస్తూ నిలబడి పోయాను !!!

*